క్లుప్తంగా

ఇంటింటి చెత్త సేకరణ చేయాలి



పాయకాపురం(విజయవాడరూరల్): డివిజన్లో ఇంటింటి చెత్త సేకరణ చేయాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ సుజన సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా జోనల్ కమిషనర్ మంగళవారం 62వ డివిజన్‌లో ఎల్‌బీఎస్ నగర్, పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్, ఆంధ్రాబ్యాంక్ సెంటర్లలో కాల్వలను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావును పిలిచి రోజూ ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, కాల్వల్లో వ్యర్థాలు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అలంపూరు విజయ్, రామిరెడ్డి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సంబంధిత అధికారులకు సూచించారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రవాణా శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన ర్యాలీని కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలకు ద్విచక్ర వాహనాలే ప్రధాన కారణమన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, ఇద్దరికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేయడం, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించి కళాశాల విద్యార్థులకు చూపాలన్నారు. విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. డీటీసీ ఎం. పురేంద్ర, రవాణా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత ముఖ్యంగా చిన్నారులు మత్తు పదార్థాలకు బానిసవుతున్నట్లు గుర్తించామన్నారు. నగర పరిధిలోని మురికివాడల్లో మత్తుపదార్థాల వినియోగం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై టీంలుగా ఏర్పడి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వార్డు సచివాలయాలలోని వలంటీర్లు, మహిళా పోలీసుల సేవలను వినియోగించుకుని సమాచారం సేకరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు వసతి గృహాల పరిధిలో మత్తుపదార్థాల అమ్మకాలు నిర్వహించకుండా పర్యవేక్షించాలన్నారు. నగరాన్ని నాలుగు జోన్లుగా విభజించి ఆయా ప్రాంతాల పరిధిలోని మత్తుపదార్థాల అమ్మకం, వాడకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఏడీసీపీ వెంకటరత్నం, డీఈవో సీవీ రేణుక, డీఎం అండ్ హెచ్‌వో ఎం సుహాసిని, సంక్షేమ అధికారి విజయభారతి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్‌లోని న్యూరాజరాజేశ్వరీపేట నుంచి పాత రాజరాజేశ్వరీపేట వైపునకు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులను కార్పొరేటర్ ఇసరపు దేవి మంగళవారం ప్రారంభించారు. రూ.7 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన పనులను వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ ఓల్డ్ ఆర్ఆర్‌పేట నుంచి న్యూఆర్ఆర్‌పేటకు వచ్చే ప్రధాన మార్గంలో ఉన్న యూజీడీ మెయిన్ లైన్ పైపులు పగిలిపోవడంతో డ్రెయినేజీ సమస్య నెలకొందని ఇబ్బందులను పరిష్కరించడానికి 7 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, పఠాన్ నజీర్‌ఖాన్, నెల్లి గోవింద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పి) జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ వై.కె.విశ్వనాథ్ ఎన్నికైన సందర్భంగా మంగళవారం విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై కేంద్రం బిల్లు పెట్టాలని కోరుతూ ఫిబ్రవరి 12ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు విజయవాడ-హైదరాబాద్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 32వ డివిజన్ 228 వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్, అధికారులతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఉనికి కోసమే లోకేష్ పాదయాత్ర

ఉనికి కోసమే నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. చిత్తశుద్ధిలేని నేతలు చేసే పాదయాత్రలను ప్రజలు విశ్వసించరన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్ల టీడీపీ పాలనలో పేదలకు చేసిందేమిటో లోకేష్ తన యాత్రలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని.. ఏ ప్రాంతానికి వెళ్లినా తమ ఇంట్లో ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చారనేది లబ్ధిదారులే ముందుకొచ్చి చెబుతున్నారన్నారు. ఇటీవల టీడీపీ సభలతో 11 మంది అమాయక ప్రజలు చనిపోయారని.. కందుకూరు, గుంటూరు తరహాలో ఎవరన్నా చనిపోతే ఎవరు బాధ్యత వహిస్తారనే అంశంపై కూడా టీడీపీ లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ



జల్లావారి వీధిలో జరుగుతున్న మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక 33వ డివిజన్ సత్యనారాయణపురంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ శర్వాణిమూర్తి అధికారులతో కలసి పర్యవేక్షించారు. గిరి వీధి, జల్లావారి వీధుల్లో జరుగుతున్న యూజీడీ, డ్రైనేజీ వాటర్ లైన్ నిర్మాణ పనులను పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురంలో వీధులు లోతట్టుగా ఉన్నాయన్నారు. స్టాం వాటర్ డ్రెయిన్ నిర్మాణాలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు నిండి ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహకారంతో డివిజన్‌లో సుమారు కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, తల్లాప్రగడ గోపాల్, శ్రీనివాసు, చల్లా సుధాకర్, నాదెండ్ల రవిశంకర్, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలే సమాజానికి వెలుగు

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



బాలికాదినోత్సవ ర్యాలీలో కార్పొరేటర్ మల్లీశ్వరి, బ్రహ్మదేశం వసంతకుమార్ తదితరులు



మాట్లాడుతున్న ఏసీపీ ప్రభాకర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆడపిల్ల దేశానికే గర్వకారణం అని, వారే వెలుగని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో మంగళవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తారని ఇప్పటికే నిరూపించారన్నారు. అవకాశాలు కల్పిస్తే ఆడపిల్లలు అద్భుతాలు సృష్టిస్తారన్నారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ ఆడపిల్లలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం దుర్గాపురం పురవీధుల్లో ర్యాలీ జరిగింది. అనంతరం బాలికలు మానవహారంగా ఏర్పడి బాలికలను రక్షించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ కె.శివ, కె.రాము, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ వెస్ట్‌జోన్ ఏసీపీ డేగ ప్రభాకర్ సూచించారు. ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. సీఐ రాజ్యలక్ష్మి జనవరి 24న ప్రత్యేకతను, ఆవశ్యకతను, బాలికల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, మహిళా పోలీసులు మాట్లాడారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆడపిల్లలే ఇంటికి, సమాజానికి వెలుగని, బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించడం మానవ జాతికే లాభమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కోలా పవన్ మిత్రబృందం ఆధ్వర్యాన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమం సింగ్‌నగర్ అమెరికన్ హాస్పటల్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథి స్థానిక బాలికలతో కలిసి కేకు కట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మన రాష్ట్రంలో బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం బాలికలకు రోప్ బ్యాగ్, వాటర్ బాటిల్, స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. నాయకులు బల్లం కిషోర్, నక్కా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇండో బ్రిటీష్'లో రమేష్ హాస్పిటల్ గుండె వైద్యసేవలు

అందుబాటులోకి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): నగరంలోని శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలోని ఇండో బ్రిటీష్ హాస్పటల్‌లో రమేష్ హాస్పటల్ ఆధ్వర్యాన గుండె వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు రమేష్ హాస్పటల్ చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్ బాబు చెప్పారు. ఈ నెల 26 నుంచి ప్రారంభంకానున్న గుండె వైద్య సేవలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో అందుబాటులోకి రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ గుండెపోటు, స్టంట్ యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ, వాల్వ్ మార్పిడి సర్జరీ, పేస్ మేకర్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్, హార్ట్ ఫెయిల్యూర్‌కు సీఆర్‌టీడీ, చిన్న పిల్లల్లో వచ్చే గుండె జబ్బులకు నిపుణులైన వైద్య బృందం సేవలు అందిస్తారని పేర్కొన్నారు. అక్కడ 50 పడకలతో 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌లో లబ్ధిదారులకు సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ ఆధ్వర్యాన గురువారం ఉదయం 10 గంటలకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకులు సజ్జా ఎలియాజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా బీపీ, షుగరు, ఈసీజీతో పాటు అవసరమైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94947 67633, 94947 67733లో సంప్రదించాలని సూచించారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కనపర్తి కొండలరావు, ఈఓ నాగినేని భవాని పర్యవేక్షించారు.

కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి నున్న రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం శాంతినగర్‌కు చెందిన అద్దంకి రాజు కుమారుడు అద్దంకి సాయిహర్ష(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తెల్లవారు జామున 4గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాది పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర శివారు సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో దోమల వ్యాప్తిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్ సూచించారు. మలేరియా విభాగం-3లోని అధికారులు, సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు, వాటిల్లో నిలిచిపోయిన మురుగునీటితో దోమల సమస్య అధికంగా ఉంటుందని, సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వీటికి తోడు బుడమేరు కాలువలో కూడా దోమల వ్యాప్తి అధికంగా జరుగుతుందన్నారు. పెరుగుతున్న దోమల సమస్యను పరిష్కరించేందుకు రోజుకో ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ బెనర్జీ పాల్గొన్నారు.

నేడు మెగాలోన్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): బెంజిసర్కిల్ సమీపంలోని వేదిక కల్యాణ మండపంలో బుధవారం మెగాలోన్ మేళా జరగనుంది. మేళాలో ప్రముఖ బ్యాంకులు పాల్గొని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవసరమైన అన్ని రకాల రుణ సదుపాయాలు కల్పిస్తాయని ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డాక్టర్ దాసరి దేవరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర వివరాలకు 80747 30408లో సంప్రదించాలని సూచించారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త అదృశ్యంపై భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజాసెంటర్ లక్ష్మీస్ట్రీట్‌కు చెందిన నారిపోగు వేణి, రవికుమార్ భార్యభర్తలు. రవికుమార్ రైల్వే ఉద్యోగి. రోడ్డు ప్రమాదం జరగడంతో అతని ఉద్యోగం వేణికి ఇచ్చారు. ఈ నెల 16న భార్యభర్తలు, కు టుంబ సమేతంగా నాగపట్నం వెళ్లారు. 20వ తేదీ తిరి గి విజయవాడ వచ్చిన తర్వాత బయటకు వెళ్లి వస్తా నని చెప్పిన రవికుమార్ తిరిగి రాలేదు. దీంతో ఆందో ళన చెందిన వేణి, ఇతర కుటుంబసభ్యులు అతతని కో సం వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య పరిరక్షణలో లయన్స్ సేవలు అభినందనీయం

కలెక్టర్ ఢిల్లీరావు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గుణదల (విజయవాడ తూర్పు): సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే లయన్స్ క్లబ్ నిర్వాహకులు అంధ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ ఆర్థిక సహకారంతో గుణదల విజయమేరి సంయుక్త అంధబాలల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంధ విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించాలనే సదుద్దేశంతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. రూ.2.5 లక్షల వ్యయ అంచనాతో ఈ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యాన్ని అందించడం హర్షణీయమన్నారు. మనిషికి నీరు ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీటిని తీసుకోవాలని తెలిపారు. అనంతరం లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ పుట్టగుంట సతీష్ కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు జరిగాయన్నారు. ప్రకృతి విపత్తులు, కరోనా విజృంభణ వంటి విపత్కర పరిస్థితుల్లో లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించామని వివరించారు. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, పాఠశాల కరెస్పాండెంట్ సిస్టర్ అమల, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, లయన్స్ క్లబ్ మెగా సిటీ ప్రతినిధులు దామెర్ల శ్రీశాంతి, లింగం శివశంకర్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, కళాశాలలు, ప్రభుత్వ విద్యాలయాలు కొత్త వైభవాన్ని సంతరించుకుంటున్నాయని ఏపీ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రూ. 2.32 కోట్ల వ్యయ అంచనాతో భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన కళాశాలను మోడల్ కాలేజీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కళాశాలలో మంచినీటి సదుపాయం, మరుగు దొడ్లు, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు, ఫర్నిచర్.. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో రాజీ పడబోమని తెలిపారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కళాశాలకు ప్రహరీ నిర్మించి పరిరక్షించామని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు రూ. 2.32 కోట్ల నిధులతో నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వంలో విద్యాలయాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని దయనీయ పరిస్థితులలో ఉండేవన్నారు. మూడున్నరేళ్ల కాలంలో విద్యారంగానికి రూ. 53 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని కితాబిచ్చారు. విద్యా రంగంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే తలమానికంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఈఈ బి.అనిల్ కుమార్, డీఈ రాయన్న, ఏపీ ఎడ్యుకేషనల్ వర్క్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ మాధవీలత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ కోఆర్డినేటర్ రాంబాబు, కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావు, డివిజన్ కోఆర్డినేటర్ కోలా నాగాంజనేయులు, అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి నాదసంగమం



నాద సంగమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యాన భీష్మ ఏకాదశి సందర్భంగా ఎస్ఎన్‌పురంలోని సీతారామ కల్యాణ మండపంలో వారంపాటు నాదసంగమం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కన్వీనర్ పాణ్యం దక్షిణామూర్తి తెలిపారు. దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమాలు 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమ ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వాహకుల సూచన మేరకు ఆగిరిపల్లిలోని వేద పాఠశాలలో జరుగుతాయని మిగిలిన రోజుల్లో సీతారామ కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించవచ్చని తెలిపారు. హరికథలు, కూచిపూడి సంప్రదాయ నృత్యాలు, భక్తి రంజని, వీణ, మృదంగం, వయోలిన్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. మృదంగ విద్వాంసుడు అమ్ముల ప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లాంటి సంస్థలు సహకారం అందిస్తునట్లు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో మద్దూరి సీతారామకృష్ణ, నెమ్మలూరి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అయ్యదేవర జీవితం జాతికి ఆదర్శం



అయ్యదేవర జయంతి కార్యక్రమంలో కొప్పరపు బలరామకృష్ణమూర్తి, మహాబలేశ్వరారవు తదితరులు

విజయవాడ కల్చరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, బహుగ్రంథకర్త అయ్యదేవర కాళేశ్వరరావు జీవితం జాతికి ఆదర్శమని బ్రాహ్మణసేవా సంఘం రాష్ట్ర నేత కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. తెలుగు కళావాహిని, ఆర్టిస్ట్ అసోసియేషన్, అయ్యదేవర కాళేశ్వరరావు చారిటబుల్ సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం అయ్యదేవర కాళేశ్వరరావు 140వ జయంతి వేడుకలు నిర్వహించారు. బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోనూ, హోమ్ రూల్ ఉద్యమంలోనూ క్రియాశీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఏపీ శాసనసభకు తొలిస్పీకర్‌గా సేవలు అందించారని, గ్రంథాలయ ఉద్యమం ద్వారా ప్రజలను చైతన్యపరిచారని, విజయవాడ రామోహ్మన గ్రంథాలయం స్థాపించడానికి కృషి చేసినట్లు తెలిపారు. అయ్యదేవ కాళేశ్వరరావు ట్రస్ట్ చైర్మన్ తుర్లపాటి మహాబలేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ శేషుకుమార్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సాంస్కృతిక ఐక్యవేదిక నిర్వాహకుడు బోడి ఆంజనేయరాజు, వివిధ సంస్థల ప్రతినిధులు మాడుగల రామకృష్ణ, చలపతిరావు, రమణ కాళేశ్వరరావు జీవిత విశేషాలను వివరించారు. అయ్యరదేవర కాళేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

ఒలింపియాడ్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీచైతన్య విద్యార్థులు సత్తాచాటారని కళాశాల ప్రిన్సిపాల్ పద్మజారాణి తెలిపారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ఒలింపియాడ్ పరీక్షల్లో నగదు, బంగారు బహుమతి సాదించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు నగదు బహుమతి, 43 మందికి బంగారు పతకాలు, 80 మందికి మెరిట్ సర్టిఫికెట్‌లు వచ్చాయన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఈజీఎం మురళీకృష్ణ, గోపాలకృష్ణ, రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• వెయ్యి మంది విద్యార్థులకు 'ఎగ్జామ్ వారియర్స్'



విద్యార్థులకు పుస్తకాలను అందజేసి వారిని ఆశీర్వదిస్తున్న గవర్నర్



పుస్తకాలు తీసుకొని వెళ్తున్న విద్యార్థినులు

ప్రధాని నరేంద్రమోదీ రచించిన ' ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారు. వెయ్యి మంది విద్యార్థులకు పుస్తకాన్ని అందజేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ